# పాపం కాశవ్వ..

- ఇటీవల కురిసిన వానకు కూలిన ఇల్లు
- నిలువ నీడలేక బిక్కుబిక్కుమంటూ జీవనం
- స్పందించిన శాసనసభాపతి ప్రసాద్‌కుమార్ వృద్ధురాలిని ఆదుకుంటామని వెల్లడి.. కొంత మొత్తం చెల్లింపు

బంట్వారం, జూలై 17 : సుమారు వందేండ్లకు పైబడిన ఓ వృద్ధురాలు.. ఆమెకు సంతానం లేదు. భర్త 50 ఏండ్ల క్రితమే మరణించాడు. అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్నది. అయితే ఇటీవల కురిసిన వానకు ఆమె ఇల్లు కూలిపోయింది. పండు ముసలితనంలో ఉండేందుకు ఇల్లు లేకుంటే ఎలా అంటూ ఆమె కన్నీరు మున్నీరవుతున్నది. మండలంలోని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన ఈడ్గి కాశమ్మ దీనగాథ ఇది.. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు గ్రామస్తులు, సామాజిక స్పృహ కలిగిన వారు స్పందించారు. ఆమెకు ఆసరా అవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వృద్ధురాలిని ఆదుకుంటామన్నారు. తక్షణ సాయం కింద కొంత మొత్తం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వెంకటేశ్‌ను ఆదేశించగా ఆయన బుధవారం కాశమ్మకు కొంత ఆర్థిక సాయం చేశాడు. అదేవిధంగా సోషల్ మీడియాకు చెందిన ఓ జర్నలిస్టు కూడా కొంత సాయం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వేడుకొంటున్నది.



ఇంటి ముందు దిగాలుగా కూర్చున్న కాశవ్వ



## మురుగు పరుగు.. రోగాల బారిన ప్రజలు

నల్లచెరువు అపరిశ్రుభంగా మారింది. మండలంలోని నల్లచెరువు గ్రామంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మురుగు ఏరులై పారుతున్నది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుండడంతో పాటు.. దోమల మోతతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

-మాడ్గుల, జూలై 17

# పట్టపగలే రెచ్చిపోతున్నారు..

- మండలంలో వరుస చోరీలు
- తాళం వేసిన ఇండ్లే టార్గెట్.. నిమిషాల్లోనే ఇల్లు గుల్ల..
- భయాందోళనలో ప్రజలు

యాచారం, జూలై 17 : మండలంలో వరుస చోరీలు స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. దొంగలు పట్టపగలే దోపిడీలకు పాల్పడుతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. రాత్రిపూట చోరీలు చేసే దొంగలు తమ రూటు మార్చారు. పగటిపూట ఇండ్లల్లో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి రెచ్చిపోతున్నారు. ఎంత దొరికితే అంతా దోచుకెళ్తున్నారు. తాళం వేసిన ఇండ్లల్లో చొరబడి నిమిషాల వ్యవధిలో గుల్ల చేస్తున్నారు. పెట్రో మొబైల్ పోలీసులు గస్తీ కాస్తున్నా, సీసీ కెమెరాల నిఘా కొనసాగుతున్నా దొంగల ఆగడాలకు మాత్రం ఫుల్‌స్టాప్ పడడంలేదు.

### వణికిస్తున్న వరుస చోరీలు..

మండలంలో ఒకపక్క హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్, మరోపక్క యాచారం ఠాణా ఉన్నప్పటికీ కొన్నిరోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో అనమోని రోశయ్య ఇంట్లో దొంగలు అర్ధరాత్రి చోరీకి యత్నించారు. అప్రమత్తమైన తల్లీకొడుకులు వారి కండ్లల్లో కారం చల్లి తరిమికొట్టిన విషయం తెలిసిందే. ఆ గ్రామంలోని మంగలి జంగయ్య ఇంటి ప్రహరీదూకి పల్సర్ వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా మేడిపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో చొరబడి బంగారం, వెండి ఆభరణాలు, కొంత నగదును తస్కరించారు. అదే గ్రామంలోని రాజిరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, పట్టు చీరలను అపహరించారు. ఆకులమైలారంలో గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అదేవిధంగా యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్‌లో ముస్లిం కమ్యూనిటీకి చెందిన ఓ వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న లక్షల విలువ గల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మల్కీజ్‌గూడ గ్రామంలో పొలంలో పనిచేస్తున్న ఓ మహిళ మెడలోంచి మూడు తులాల పుస్తెల తాడును తస్కరించారు. గడ్డమల్లయ్యగూడ గ్రామంలో రెండుసార్లు గంధం చెట్లను నరికి తీసుకెళ్లారు. గున్‌గల్, నందివనపర్తి, కుర్మిద్ద, గడ్డమల్లాయగూడ తదితర గ్రామాల్లో బోరుబావుల వద్ద విద్యుత్తు తీగలను వరుసగా దొంగిలించారు. తులేఖుర్దు గ్రామంలో ఇటీవల నంబర్‌ప్లేటు లేని కారులో అపరిచితులు తిరుగుతున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. వారి గురించి పోలీసులు సీసీ కెమెరాల్లో ఆరా తీసినా ఫలితంలేదు. తాజాగా మొగుళ్లవంపు గ్రామంలో రజిత అనే మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును దొంగిలించే క్రమంలో గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇలా ఎదో ఒక చోట చోరీలు జరుగుతుండడంతో మండల ప్రజలు రాత్రిపూట భయాందోళనకు గురవుతున్నారు. అపరిచితులు కనిపించినా, మహిళలు ఒంటరిగా ఉన్నా దొంగల భయంతో జంకుతున్నారు.



బీరువా పగులగొట్టి చోరీ(ఫైల్)

### పోలీసులు గస్తీ పెంచాలి



మండలంలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు దొంగల భయంతో వణికిపోతున్నారు. పోలీసులు గ్రామాల్లో చోరీలపై అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు జరిగేలా చొరవ తీసుకోవాలి. మెట్రో మొబైల్ పోలీసులతో గస్తీ పెంచాలి. **- మండలి గోపాల్, అయ్యవారిగూడ యాచారం**

### బందోబస్తు పెంచుతాం..

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా దోపిడీలు, చోరీలు జరిగితే 110 నంబర్‌కు సమాచారమివ్వాలి. రాత్రిళ్లు బందోబస్తును పెంచుతాం. అన్ని గ్రామాల్లో ప్రధాన వీధులు, కూడళ్ల వద్ద, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.



**-నరసింహారావు, సీఐ హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా**

## బల్దియాలో 1050 ఖాళీల భర్తీకి ప్రతిపాదన

సిటీబ్యూరో : జీహెచ్‌ఎంసీలో పారిశుధ్య విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే శానిటేషన్ విభాగంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 1050 మంది వర్కర్ల నియామకానికి అనుమతి ఇవ్వాలంటూ.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. పారిశుధ్య విభాగంలో స్వీపర్ల సంఖ్య తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. స్వీపర్ల శాశ్వత ఖాళీల భర్తీపై నిషేధం (బ్యాన్)పై ప్రభుత్వం నుంచి సడలింపు ఉత్తర్వులు పొందే వరకు శానిటరీ వర్కర్ గ్రూప్ ద్వారా ఔట్ సోర్సింగ్ శానిటేషన్ వర్కర్ క్లాస్-4 ఉద్యోగుల ఖాళీతో ఏర్పడిన పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**శానిటేషన్ విభాగంలో ఉద్యోగుల వివరాలు**

| | |
|---|---|
| • ఔట్ సోర్సింగ్ వర్కర్స్ | 18343 |
| • పీహెచ్ వర్కర్స్ | 2365 |
| • ఎస్ఎఫ్ఏలు | 952 |
| • శానిటరీ సూపర్‌వైజర్స్, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ | 24 |
| • ఫీల్డ్ ఆఫీసర్స్(డీఈఈ/ఏఎంవోహెచ్) | 29 |
| • ఎన్విరాల్‌మెంటల్ స్పెషలిస్ట్స్ | 30 |

## 'ఉజ్జయిని' జాతర పనులను వేగవంతం చేయాలి

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ)/బేగంపేట: ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఈనెల 21న జరిగే బోనాలు, 22న రంగం (భవిష్యవాణి), మహాహారతి కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహంకాళి జాతరకు సంబంధించిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జాతరలో విద్యుత్ అంతరాయం ఉండకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ దేవస్థానం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ దశరత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జీరో అవర్.. డబ్బులు సేఫ్!

## 'సైబర్' మోసాల్లో వేగంగా స్పందించాలి

- వెంటనే 1930కు కాల్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి
- దోచుకున్న సొమ్ము వెనక్కి రప్పించేందుకు అవకాశం
- పౌరులకు సైబర్ పోలీసుల సూచనలు
- ఐదు ఘటనల్లో రూ. 46 లక్షలు వాపస్ బాధితులకు అందజేత




సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): ఇటీవల సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వివిధ రకాలుగా దోచుకుంటున్నారు. అయితే బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి.. వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్, 1930, సైబర్‌క్రైమ్ ఠాణాకు జీరో అవర్‌లో ఫిర్యాదు చేస్తే పోయిన సొమ్మును వెనక్కి రప్పించేందుకు ఎక్కువ అవకాశాలుంటాయని సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణా ఆధ్వర్యంలో జీరో అవర్‌లో ఫిర్యాదు చేసిన పలువురికి పోయిన సొత్తును వెనక్కి రప్పించి బాధితులకు అప్పగించినట్లు డీసీపీ కవిత వెల్లడించారు. ఐదు ఘటనల్లో రూ. 5532900 సైబర్‌నేరగాళ్లు దోచుకోగా, జీరో అవర్‌లో ఫిర్యాదు చేయడంతో రూ. 46,07,085 నగదు వెనక్కి రప్పించి, బాధితులకు అందించినట్లు చెప్పారు.

**ప్రధానమైన కేసుల వివరాలివి..**

- ☞ అంబర్‌పేటకు చెందిన బాధితుడికి గత నెల 27న 'మేము ఫెడెక్స్ కొరియర్ సంస్థ నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఆధార్ నంబర్‌పై ముంబై నుంచి ఇరాన్‌కు డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి' అంటూ ఆగంతకులు ఫోన్ చేశారు. ఇంతలో తాము ముంబై సైబర్‌క్రైమ్ పోలీసులం మాట్లాడుతున్నామంటూ.. స్కైప్‌లో కాల్ చేసి.. డిజిటల్ అరెస్ట్ చేశారు. మీ పేరుతో స్మగ్లింగ్ జరుగుతున్నది. ఆర్‌బీఐ, సీబీఐ విభాగాలు నీపై విచారణ చేస్తున్నాయం'టూ.. బ్యాంకు ఖాతాలు తీసుకొని రూ. 19,92,921 లక్షలు ప్రీ అప్రూవుడ్ లోన్ తీసుకున్నారు. ఆ తర్వాత బెదిరించి అందులో నుంచి రూ. 18 లక్షలు కాజేశారు. అయితే బాధితుడు వెంటనే హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాను సంప్రదించడంతో ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించి.. వెంటనే రూ. 18 లక్షలు ఆయా ఖాతాల్లో నిలిపివేయించి.. ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేయించారు. కోర్టు అనుమతితో అందులోంచి డబ్బు వెనక్కి రప్పించి బాధితుడికి అప్పగించారు.
- ☞ ఇటీవల ఓ బాధితుడికి కేవైసీ అప్‌డేట్ పేరుతో ఏపీకే ఫైల్స్ పంపించిన సైబర్‌నేరగాళ్లు..అతడి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నుంచి రూ. 2 లక్షలు కాజేశారు. బాధితుడు వెంటనే సైబర్‌క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయించారు. ఆయా ఖాతాలను బ్లాక్ చేసి.. రూ. 1,75,185 వెనక్కి రప్పించారు.
- ☞ ముంబై పోలీసులమంటూ ఫోన్ చేసి.. 'మీ పేరుతో స్మగ్లింగ్ జరుగుతున్నదని బెదిరించి.. రూ. 5.90 లక్షలు కాజేశారు. బాధితుడు సైబర్‌క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో సిబ్బంది వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించి బాధితుడి డబ్బు వెళ్లిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి.. అందులో నుంచి రూ. 4,73,000 లక్షలు వెనక్కి రప్పించారు.
- ☞ రూ. 20.08,900 పోగొట్టుకున్న ఓ వ్యక్తి వెంటనే సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ డబ్బులను వాపస్ తెప్పించి బాధితుడికి అందజేశారు.
- ☞ మరో బాధితుడు రూ. 9.40 లక్షలు పోగొట్టుకొని.. ఫిర్యాదు చేయడంతో సైబర్‌నేరగాళ్ల బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. రూ. 1.5 లక్షలు వెనక్కి రప్పించారు.

## అధిక అద్దెలు... ఆదరణ కరువు

### మెట్రో స్టేషన్లలో ఖాళీగా వ్యాపార స్థలాలు



సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్-టీవోడీ)కి ప్రాధాన్యత లేకుండా పోతోంది. ముఖ్యంగా మెట్రో రైళ్లలోనే ప్రయాణం చేస్తూ ఆయా స్టేషన్లలో షాపింగ్ చేసేలా ప్రత్యేకంగా వాణిజ్య స్థలాలను ప్రతి మెట్రోస్టేషన్‌లోనూ నిర్మించారు. ప్రతి రోజూ 5 లక్షల మంది నగర వాసులు మెట్రో రైళ్లలో ప్రయాణం చేస్తున్నా.. వారికి అవసరమైన షాపింగ్ సెంటర్లను స్టేషన్లలో అందుబాటులోకి తీసుకురావడం లేదు. కేవలం 4-5 మెట్రో స్టేషన్లు మినహాయిస్తే మరెక్కడా షాపింగ్ సెంటర్ల జాడ కనిపించడం లేదు. కేవలం అమీర్‌పేటలోనే వ్యాపార కార్యకలాపాలు కొంతమేర అనుకున్న స్థాయిలో ఉన్నాయి. ఇక ప్రారంభ మెట్రో స్టేషన్లైన ఎల్బీనగర్, మియాపూర్, జేఎన్‌టీయూ, నాగోల్, రాయదుర్గం,హైటెక్ సిటీ వంటి స్టేషన్లలో వ్యాపారాలు ఏర్పాటు చేసిన వారు ఎక్కువ కాలం వాటిని నిర్వహించలేకపోతున్నట్లు సమాచారం. స్టేషన్లలో ఉన్న వాణిజ్య స్థలాలను అద్దెకు తీసుకోవాలంటే చదరపు అడుగుకు రూ.80 నుంచి రూ.100ల వరకు కోట్ చేస్తున్నారు. ఈ స్థాయిలో వాణిజ్య స్థలాల ధరలు ఉంటే.. తాము ఎలా వ్యాపారాలు చేస్తామని నిర్వాహకులు వాపోతున్నారు.

### వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి తోడు చురుకుగా కదులుతున్న రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి తేలికపాటి వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, అల్పపీడనం ప్రభావంతో గ్రేటర్‌లోని లింగంపల్లి, రామచంద్రాపురం, చందానగర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి.

## చెరువుల పరిరక్షణపై పట్టింపేదీ?

**కేసీఆర్ ప్రభుత్వంలో సుందరీకరణకు రూ. 271 కోట్లు కేటాయింపు**

ఎనిమిది నెలలుగా పనుల్లో పురోగతి చూపని బల్దియా

సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ ) : చెరువుల రక్షణలోనే కాదు...సుందరీకరణ పనుల్లోనూ జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం చూపుతున్నది. చెరువుల పరిరక్షణే ధ్యేయంగా 'హైడ్రా' విభాగాన్ని ఏర్పాటు చేశామని ఒక వైపు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేక కబ్జాదారులకు కొందరు అధికారులు వంత పాడుతున్నారు. చేతిలో ఉన్న నిధులతో పరిరక్షణ.. సుందరీకరణ పనులు చేపట్టి మినీ పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాల్సిన అధికారులు.. గడిచిన ఏడు నెలలుగా పనులపై పురోగతి చూపించడం లేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న 185 చెరువులను కాపాడి పరిసరాలను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన బల్దియా.. సుందరీకరణ పనులను అటకెక్కించింది. చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా మురుగునీరు చెరువుల్లోకి చేరుతుండటంతో దుర్వాసన వస్తున్నది. ఈ నేపథ్యంలో చెరువు సుందరీకరణ పనులు నిలిచిపోవడంపై జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గత కేసీఆర్ సర్కారు జీహెచ్‌ఎంసీ పరిధిలో తొలి విడతగా 20 చెరువుల సుందరీకరణ పనులను రూ. 271.33 కోట్లతో చేపట్టింది. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక..గడిచిన ఏడు నెలలుగా చెరువుల సుందరీకరణ పనులు ఏ మాత్రం ముందుకు కదలడం లేదు.

**చెరువుల అభివృద్ధి పనుల వివరాలు**

| వర్క్ | అభివృద్ధి చేసే చెరువుల సంఖ్య | పూర్తైనవి | పురోగతిలో ఉన్నవి |
|---|---|---|---|
| ఫెన్సింగ్ అండ్ బౌండరింగ్ | 56 | 32 | 24 |
| సివరేజీ డైవర్షన్ | 89 | 21 | 68 |
| సర్‌ప్లస్/ స్లూయిస్ మరమ్మతులు | 144 | 110 | 34 |
| సోషల్ ఇన్‌ఫ్రా/బ్యూటిఫికేషన్ | 34 | 3 | 31 |

# ఆర్టీఏలో బ్రోకర్ల వ్యవస్థకు చెక్

## స్లాట్ బుక్ చేసుకున్న వారికే లోనికి అనుమతి

- దళారుల బెడద లేకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆర్టీఓ కార్యాలయాల్లో అదనంగా 8 సీసీ కెమెరాలు
- ఇప్పటికే ఖైరతాబాద్‌లో 19 ఏర్పాటు
- ఇటీవల ఓ ఉన్నతాధికారిపై దాడి నేపథ్యంలో అప్రమత్తం




సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ): ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల బెడద లేకుండా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారిని మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. ఇటీవల ఆర్టీఏ కార్యాలయాల్లో బ్రోకర్లు చెలరేగిపోతున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందడంతో చర్యలు చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న అన్నీ ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులెవ్వరినీ లోపలికి అనుమతించడం లేదు. ఎవరి పేరుతో స్లాట్ బుక్ అవుతుందో..వారిని మాత్రమే లోనికి అనుమతించి పని పూర్తి చేస్తున్నారు.

అంతేకాదు ఎవరైనా కొత్తగా రవాణా సేవల గురించి తెలుసుకోవాలనుకుంటే గేటు వద్దే ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉండి ఆ వివరాలను అందిస్తున్నారు. దీంతో ఇక కార్యాలయాల్లోకి దళారులు వెళ్లే దారులన్నీ మూసుకుపోయాయి. ఈ విధానం కారణంగా ఆర్టీఏ కార్యాలయాల్లో పారదర్శకతకు పెద్దపీట వేశారు.

### సీసీ కెమెరాల సంఖ్య పెంచి..

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రతి ఆర్టీఏ కార్యాలయాల్లోనూ సీసీ కెమెరాల సంఖ్య పెంచడంపైనా దృష్టి సారించారు. ఇప్పటికే ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో 19 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఆర్టీవో కార్యాలయంలోనూ అదనంగా 8 సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు అధికారులకు కూడా సమాచారం అందింది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భద్రతపరమైన అంశాలను పర్యవేక్షించే వీలుండనున్నది. ఇటీవల ఓ ఉన్నతాధికారిపై దాడి జరగడం కూడా సంచలనంగా మారడంతో కార్యాలయాల్లోకి అనవసర పనులపై వచ్చే వారిని అనుమతించకూడదని అంతర్గంగా అధికారులకు ఆదేశాలందాయి. ఈ నేపథ్యంలోనే అన్నీ ఆర్టీఓ కార్యాలయాల్లో ప్రత్యేక సిబ్బందితో తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ కారణంగా కార్యాలయాల్లో స్లాట్స్ మీదొచ్చే పనులు కూడా త్వరితగతిన పూర్తవుతున్నాయని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి గడబిడ లేకుండా సాఫీగా పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు.



ప్రజలకు డెంగీ నివారణపై అవగాహన కల్పిస్తున్న బల్దియా సిబ్బంది

## అవగాహనతో డెంగీని నివారిద్దాం

సిటీబ్యూరో, జూలై 17 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో డెంగీ వ్యాధి నివారణే ప్రధాన లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ విస్తృత అవగాహన, నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఎంటమాలజీ చీఫ్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని, యాంటీ లార్వల్ ఆపరేషన్స్, ఐఈసీ కార్యక్రమాలు, దోమల ఉత్పత్తి అయ్యే హాట్ స్పాట్‌లపై దృష్టి సారించినట్లు చెప్పారు.

# లేడీ.. కిలాడీ!

- పెట్టుబడికి రెట్టింపిస్తానంటూ రూ.3.06 కోట్లు వసూలు
- డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే.. కేసులు పెట్టిస్తానంటూ బ్లాక్ మెయిల్
- ఈవోడబ్ల్యూ పోలీసులకు బాధితుల ఫిర్యాదు.. నిందితురాలి అరెస్టు

సిటీబ్యూరో, 17 (నమస్తే తెలంగాణ): 'నా వద్ద కోట్ల రూపాయల విలువ చేసే ఫ్లాట్లు, అపార్ట్‌మెంట్లు వంటి స్థిరాస్తులున్నాయి. నాకు ఆర్థికంగా సహాయం చేసే.. మీ పెట్టుబడికి రెట్టింపు రాబడి ఇస్తానం'టూ...ఓ కిలాడి లేడీ అమాయకులను మోసం చేసి.. వారి నుంచి రూ.3.06 కోట్లు దోచుకుంది. వివరాల్లోకి వెళితే....పనుగంటి ఇందిరాదేవిరెడ్డి(29) తనకు తాను ఎన్‌ఆర్‌ఐగా పరిచయం చేసుకున్నది. ప్రస్తుతం నాగోల్‌లో బ్యూటీపార్లర్‌తో పాటు దేవీఫుడ్స్ పేరుతో అక్కడే ఫుడ్ ఇండస్ట్రీ కూడా నడుపుతున్నది. అంతే కాకుండా మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి ప్రాంతాల్లోని పలు గేటెడ్ కమ్యూనిటీల్లో కోట్ల రూపాయలు విలువ చేసే స్థిరాస్తులున్నాయని, నాగోల్‌లో ఒక అపార్ట్‌మెంట్ కూడా ఉన్నట్లు జనాలను నమ్మించింది. ఆర్థిక సాయం కింద తన వద్ద పెట్టుబడి పెడితే రెట్టింపు రాబడి చెల్లిస్తానని నమ్మబలికింది. ఈ క్రమంలో పలువురు నుంచి రూ. 3.06 కోట్లు వసూలు చేసింది. అంతటితో ఆగకుండా ఇద్దరు బాధితులకు చెందిన రెండు కార్లు సైతం తీసుకొని.. వారికి తెలియకుండానే తనఖా పెట్టింది. పైగా తన ఇద్దరు స్నేహితులను పోలీసు అధికారులుగా బాధితులకు పరిచయం చేయించి.. వారి డబ్బుతో 2ఐ ఫోన్లు, ఓ వన్‌ప్లస్ మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. అయితే ఇందిరాదేవి బాగోతాన్ని తెలుసుకున్న బాధితులు.. డబ్బు, కార్లు తమకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేయడంతో నిందితురాలు స్పందించకపోవడమే కాకుండా కేసులు పెట్టిస్తానంటూ బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేసింది. దీంతో మదీనాగూడకు చెందిన సత్యనారాయణ తమకు జరిగిన అన్యాయంపై సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని..దర్యాప్తు చేసిన పోలీసులు.. బుధవారం ఇందిరాదేవిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే గతంలోనూ నిందితురాలు ఇదే తరహా మోసాలకు పాల్పడటంతో మాదాపూర్ ఠాణాలో కేసు నమోదైంది. ఆమెనుంచి రెండు కార్లు, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నారు.